# నేరము -శిక్ష



*బహిర్లో మ్నాతుషణ్మాసాన్*
*వేష్టితః ఖర చర్మణా*
*చారాతి క్రమణేభిక్షాం*
*దేహీ త్యుక్త్వా విశుధ్యతి*

***భావం:*** భార్యకు ద్రోహం చేసిన వ్యక్తి ఆరు నెలలు పాటు గాడిద చర్మాన్ని వెంట్రుకలు కనపడేలా ధరించి భిక్షాటన చేస్తేనే పరిశుద్ధుడవుతాడు.

సుమారు రెండువేల అయిదు వందల సంవత్సరాల క్రిందట సంగతి. భారతదేశంలో మహోజ్జ్వలమైన నాగరికత వెల్లివిరుస్తున్న కాలం. సుసంపన్నమై, సస్యశ్యామలమై ఇతర దేశ ప్రజలను వృత్తివ్యాపారాలకై

ఆకర్షిస్తున్న సమయం. అరబ్బు ప్రాంత ఎడారుల గుండా ఒంటెల బిడారులో ఒక యవన యువతీ, ఒక రోమక కన్యా ప్రయాణం చేస్తున్నారు. భారతదేశంలో కొంత కాలం పనిచేసి ధనం సంపాదించాలన్న ఆశా, పరాయిదేశంలో జీవితమెలా ఉంటుందోనన్న భయమూ సమపాళ్ళలో వారిద్దరిలో ఉన్నాయి. ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"భారతదేశంలో పురుషులు బహుపత్నీ వ్రతులట కదా."

"అంతేకాదు వారి జీవితాన్ని కేవలం శృంగారానికే అంకితం చేస్తారట. కామశాస్త్రం పై వారి మహర్షులే గ్రంథాలు రాశారట."

" మనని ఏవిధంగా ఉపయోగించుకుంటారో భయంగా ఉంది"

"మనం ఏడాదికన్నా ఉండవద్దు. వీధులలో రత్నాలు రాసులుగా పోసి ఉంటాయట. ఒక సంవత్సరంలోనే చాలా సంపాదించవచ్చు."

ఇద్దరూ కొన్నాళ్ళకి భారతదేశంలో ప్రవేశించారు. ఉజ్జయినిలో మహారాణికి చేటీ జనంగా పని దొరికింది. ఆనాటి భారతదేశంలో సంపద ఎక్కువ. పరిజనానికై పాశ్చాత్య దేశాల నుంచి మనుషులను రప్పించేవారు. పాశ్చాత్య దేశ యువతులు సంపన్నుల ఇళ్ళల్లో పరిచారికలుగా, రాణిగారి చెలికత్తెలుగా, రాజుల చామర గ్రాహిణులుగా సేవలందించేవారు.

కొన్ని రోజులు గడిచాయి. భారతదేశంలో కొందరు భిక్షాటన చేసి జీవించడం కొత్తగా వచ్చిన యువతులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పుడు చేటీ జనాధ్యక్షురాలు వారికి వివరించింది. "కొందరికి భౌతికమైన వాంఛలుండవు. వారు జీవితాన్ని భగవంతుడికే అంకితం చేస్తారు. ఏనాటికానాడు యాచించి తినడమే కానీ ఆస్తి సంపాదించరు."

రోజులు గడుస్తున్నాయి. ఒకనాడు ఉదయం అంతఃపురం ముఖద్వారం ముందు నిలబడి ఒక వ్యక్తి "భిక్షాందేహి" అన్నాడు. చేటీ

జనాధ్యక్షురాలి ఆజ్ఞపై యవన కన్య భిక్ష తీసికెళ్ళింది. భిక్షువుని చూడగానే ఆమె ఆశ్చర్యపోయింది. ప్రతిదినమూ చూసే విరాగులవలె లేదు. మెడలో, చేతులకీ బంగారు ఆభరాణాలు న్నాయి. కానీ గాడిద చర్మాన్ని ధరించి ఉన్నాడు. ఆమెకు వింతగా అన్పించి భిక్షను పాత్రలో వెయ్యలేదు. అతడు మళ్ళీ "భిక్షాందేహి" అన్నాడు.

రెండోసారి "భిక్షాందేహీ" అన్న మాట ను విన్న చేటీ జనాధ్యక్షురాలు స్వయంగా బయటకు వచ్చింది. ఆమె వెనకో రోమక యువతీ వచ్చింది. యవన కన్య స్పృహలోకి వచ్చి భిక్ష వేసింది.

"అమ్మగారు, అతనెవరు? విరాగిలా లేదు. భిక్ష దేనికి?"

"భార్యకు ద్రోహం చేసిన పురుషుడికి శిక్ష తప్పదు కదా"

"భార్యకు ద్రోహమా? ఎంత మందితోనైనా వివాహం చేసుకోవడంకన్నా ద్రోహమేముంది?"

చేటీ జనాధ్యక్షురాలు సన్నగా నవ్వింది. "మా దేశంలో బహుపత్నీ వ్రతమున్న మాట వాస్తవమే. కానీ ఏ మగవాడూ భార్యలెందరున్నా ఏ ఒక్క భార్యకూ వస్త్ర, ఆహార, ఆభరణ, శయనాలలో్ లోటు చెయ్యరాదు. అగ్ని సాక్షిగా వివాహమైన భార్యలను మించి ఇంకో స్త్రీ గురించి ఆలోచించరాదు. భార్యకు ద్రోహం చేసినవాడు వెంట్రుకలు కన్పించేలా గాడిద చర్మం కప్పుకుని ఆరునెలలు ముష్టెత్తాలి. "

భారతదేశ వివాహాలలో స్త్రీకి అన్యాయమే జరుగుతుందనుకుంటూ పరదేశాల నుంచి వచ్చిన యువతులు ఆశ్చర్యపోయారు. నేడు కూడా అందరూ ఆశ్చర్యపోయే సంగతి కదా.

*****